
సాక్షి గుంటూరు
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



జ్ఞాన మందిరం వార్షికోత్సవం

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలం కొలకలూరులోని రామసాయి జ్ఞాన మందిరంలో 16వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 516.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

సిద్ధమవుతున్న కాకాని ప్రభ



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ తిరునాళ్లకు తరలివెళ్లేందుకు కాకాని నుంచి భారీ విద్యుత్ ప్రభ సిద్ధమవుతుంది. 13 సంవత్సరాలుగా కాకాని నుంచి భారీ విద్యుత్ ప్రభను గ్రామస్తులు కొండకు తరలిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటువుతున్న ఈ ప్రభ 75 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రభ తడిక నిర్మాణం పూర్తయింది. ప్రభను తరలించేందుకు ఉపయోగించే రథాన్ని సిద్ధం చేస్తున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ కంచేటి వీరయ్య సహకారంతో రూ.7 లక్షల వ్యయంతో ఇనుప రథాన్ని సమకూర్చారు. ప్రభను కొండకు తరలించేందుకు దాదాపు రూ.17 లక్షల ఖర్చు అవుతుందని నిర్వాహకులు తెలిపారు. మార్చి 5వ తేదీన ప్రభను రథంపై నిలబెట్టనున్నారు. 6వ తేదీ ప్రభ కొండకు బయలుదేరుతుంది. అదేరోజు రాత్రికి కొండకు చేరుకుంటుంది. రెండురోజుల పాటు ప్రభ కొండ వద్ద కొలువుదీరనుంది.

కలుషిత ఆహారం తిని బాలిక మృతి
– నిర్ధారించిన వైద్యులు

నెహ్రూనగర్: బిహార్ రాష్ట్రం నుంచి గుంటూరు నగరానికి వలస వచ్చిన కృష్ణబాబు కాలనీలో ఉంటున్న ఓ కుటుంబంలో సరిత అనేక బాలిక కలుషిత ఆహారం రెండు రోజుల కిందట మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సరిత ఎటువంటి కలుషిత తాగునీటి వల్ల మృతి చెందలేదని, ఎల్లో మీడియా తాగునీటి వల్లే మృతి చెందిందంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. కృష్ణబాబు కాలనీ ప్రాంతమంతా తాగునీటిలో ఫ్లోరిన్ శాతం పరిశీలించారు. సమపాళ్లలో ఉందని తేల్చారు.

పల్స్‌పోలియోపై తల్లిదండ్రులను చైతన్యపర్చాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ పల్స్‌పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ఐదేళ్లలోపు వయసు గల పిల్లలందరికీ మార్చి 3న పోలియో చుక్కలు వేయించే విధంగా డీవైఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని డీఈవో పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల అసెంబ్లీ సమయంలో విద్యార్థులకు ప్రాముఖ్యత తెలియజేసి, పాఠశాల యాజమాన్య, పేరెంట్స్ టీచర్స్ కమిటీలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. జీరో నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించే విధంగా తల్లిదండ్రులను చైతన్యపర్చాలని తెలిపారు. మార్చి 3న ఆయా పాఠశాలల్లో వైద్యారోగ్యశాఖ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది వసతి ఏర్పాటు కోరితే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని సూచించారు.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైలు నంబరు 07783 విజయవాడ–గుంటూరు, 07788 గుంటూరు–విజయవాడ, 07779 గుంటూరు –మాచర్ల, 07465 గుంటూరు–విజయవాడ, 07786 గుంటూరు–రేపల్లె రైళ్ల ఈ నెల 27 నుంచి మార్చి 11వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

యార్డుకు 1,56,917 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,56,917 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,40,541 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,400 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,19,436 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

స్మార్ట్ కాదు.. గుడ్ డాక్టర్స్‌గా ఉండాలి



'యువ వైద్యులు సేవాభావంతో రోగులకు వైద్యమందించి, సమాజానికి మేలు చేయాలి. గుంటూరు వైద్య కళాశాలకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. అలాంటి కళాశాలలో ఎంబీబీఎస్ డిగ్రీ పట్టా తీసుకుంటున్న మీరంతా స్మార్ట్ డాక్టర్స్‌గా కాకుండా గుడ్ డాక్టర్స్‌గా ఉండాలి.'

– డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) డాక్టర్ జి.రఘునందన్.

- గుంటూరు వైద్య కళాశాలలో వేడుకగా గ్రాడ్యుయేషన్ డే
- 2018 ఎంబీబీఎస్ విద్యార్థులకు డిగ్రీ పట్టా ప్రదానం
- యువ వైద్యులు సేవాభావంతో వైద్యమందించాలి
- పరిశోధనలనపై దృష్టి సారించాలి: అతిథులు ఉద్బోధ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 2018 ఎంబీబీఎస్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) డాక్టర్ జి.రఘునందన్ విచ్చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. విద్యార్థులు, కళాశాల సిబ్బందితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో



అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్‌ను సత్కరిస్తున్న వైద్యులు



జోష్...డిగ్రీ పట్టా అందుకున్న ఆనందంతో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. యువ వైద్యులు స్మార్ట్ డాక్టర్స్‌గా కాకుండా.. గుడ్ డాక్టర్స్‌గా ఉండాలని సూచించారు. సమాజానికి ఉపయోగ పడేలా సేవ లందించాలని కోరారు.

సమాజం కోరుకున్న విధంగా..

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాల మేరకు, తమ ఆశలకు అనుగుణంగా డిగ్రీ పట్టా అందుకున్న యువ వైద్యులు.. సమాజం తమ నుంచి ఏమి కోరుకుంటుందో దానికి తగ్గట్టుగా పనిచేయాలన్నారు. మంచి వైద్యులుగా, భావిభారత పౌరులుగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంబీబీఎస్‌తోనే ఆగిపోకుండా.. పీజీ, సూపర్ స్పెషాలిటీ చదవాలని సూచించారు. ప్రభుత్వ రంగంలో వైద్యులకు ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథులు వైద్య విద్యార్థులకు ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన సిబ్బంది వేడుకలకు హాజరయ్యారు. గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ పాదిల ప్రసాద్ భవన నిర్మాణ దాత డాక్టర్ పాదిల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ మాతృ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి గుంటూరు వైద్య కళాశాలలో చదువుకున్న తను అమెరికాలో స్థిరపడి తన మాతృ సంస్థ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు.



సెల్ఫీ తీసుకుంటున్న యువ డాక్టర్లు

మధుర క్షణాలను బంధిస్తూ..

ఎంబీబీఎస్ డిగ్రీ పట్టా పొందిన వైద్య విద్యార్థులు గ్రూప్ ఫొటోలు, సెల్ఫీలతో సందడిగా గడిపారు. తమ ఆనందాన్ని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. తమ పిల్లలు గ్రాడ్యుయేట్స్‌గా పట్టా అందుకుంటున్న క్షణాలను కెమెరాల్లో బంధిస్తూ.. తల్లిదండ్రులు ఆనంద భాష్పాలు రాల్చారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి, తమ కలను సాకారం చేసుకున్న మధుర క్షణాలను మరుపురాని విధంగా సెలబ్రేట్ చేసుకున్నారు.




కుటుంబసభ్యులతో విద్యార్థి

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీల పాత్ర కీలకం
జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీల పాత్ర చాలా కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో వివిధ శాఖల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలన్నారు. పార్లమెంట్‌కు రూ.95 లక్షలు, అసెంబ్లీకి రూ.40 లక్షలు అభ్యర్థులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. దీనిపై నిఘా ఉంచాలన్నారు. అంతకంటే ఎక్కువ ఖర్చు చేసినా, పెయిడ్ పత్రికా ప్రకటనలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల సందర్భంగా సీజ్ చేసే బంగారు ఆభరణాలు, నగదు, ఇతర వస్తువులు నిబంధనల ప్రకారం జాగ్రత్త చేసుకోవాలని చెప్పారు. ఓట్లు కోసం ప్రభావితం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పకటికప్పుడు సమాచారం ఇచ్చి పుచ్చుకోవాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి ప్రలోభాలకు గురికాకూడదని స్పష్టం చేశారు. తమ పరిధిలో జరిగే అక్రమాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, కలెక్టరేట్ ఏఓ జానకి పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5800, గరిష్ట ధర రూ.7200, మోడల్ ధర రూ.6500 వరకు పలికింది

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

కేంద్రాలను చూతంరారండి

- హాల్ టికెట్లపై నిబంధనలు ఎత్తివేతతో ఉపశమనం
- 59,435 మంది విద్యార్థులకు 92 కేంద్రాలు
- జిల్లాలో పెరిగిన విద్యార్థుల సంఖ్య
- అదనంగా 19 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష కేంద్రాలకు వెళ్లే మార్గంలో సూచికలు, బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు
- మార్చి ఒకటిన జూనియర్, 2న సీనియర్ ఇంటర్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్ : మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు గుంటూరు జిల్లాలో సర్వం సిద్ధం చేశారు. గతేడాది వరకు 73 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్తగా 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కొత్త కేంద్రాలతో కలుపుకుని ఆ సంఖ్య 92కి చేరింది. మార్చి ఒకటి నుంచి ప్రారంభం కానున్న ప్రథమ సంవత్సర పరీక్షలకు 31,830, రెండో తేదీన ప్రారంభం కానున్న ద్వితీయ సంవత్సర పరీక్షలకు 27,605 మంది చొప్పున 59,435 మంది హాజరు కానున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చునంటూ ప్రభుత్వం కల్పించిన అవకాశం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతోంది. ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేకుండా పరీక్షలకు హాజరయ్యే విధంగా ఇచ్చిన మార్గదర్శకాలతో విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు 90 శాతానికిపైగా విద్యార్థులు హాల్ టికెట్లను పొందారు.



గుంటూరు చంద్రమౌళినగర్‌లో పరీక్ష కేంద్రానికి మార్గం చూపిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

సూచిక బోర్డులు ఏర్పాటు

కొత్తగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల చిరునామా తెలియక విద్యార్థులు ఇబ్బందులకు గురి కాకుండా ఇంటర్మీడియెట్ బోర్డు పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. హాల్ టికెట్‌పై ఉన్న విధంగా పరీక్ష కేంద్రం కోడ్ నంబరు, కళాశాల పేరు, చిరునామా వివరాలను సంబంధిత కేంద్రం వద్ద బోర్డును ఏర్పాటు చేయడంతోపాటు మెయిన్‌రోడ్డు, కనెక్టింగ్ మార్గాల దగ్గర సూచికలను ఏర్పాటు చేయాలని అధికారులు ఆయా కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను చూసి రండి

ఆలస్యమైతే అనుమతించం

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులను అరగంట ముందుగా కేంద్రాల్లోకి అనుమతించిన తరువాత 9.00 గంటలకు ప్రధాన గేట్లను మూసి వేయనున్న దృష్ట్యా, విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షలకు మరో రెండు రోజులే వ్యవధి ఉండటంతో పరీక్ష జరిగే రోజున కేంద్రాలకు చేరుకోవడంలో ట్రాఫిక్, ఇతర ఇబ్బందులకు గురి కాకుండా విద్యార్థులను వెంట పెట్టుకుని తల్లిదండ్రులు ముందుగానే పరీక్ష కేంద్రాలను స్వయంగా చూసిరావాలి. –జీకే జుబేర్, ఆర్ఐవో

అలా తప్పించడంలో.. ఆలపాటి బలి

- తెనాలిలో ఇదే మొదటిసారి కాదు
- గతంలో డాక్టర్ రావి, డాక్టర్ ఉమలకు ఇదే అనుభవం
- ఇప్పుడు ఆలపాటికీ అదే విలువ
- నిలువునా ముంచటం బాబు నైజం
- గుర్తు చేసుకుంటున్న స్థానికులు



ఆలపాటి రాజేంద్రప్రసాద్



డాక్టర్ గోగినేని ఉమ



డాక్టర్ రావి రవీంద్రనాథ్

తెనాలి: పొత్తుల పేరుతో తెనాలి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు అప్పగించారు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు. సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఈసారి పోటీ చేసేందుకు సీటు లేకుండాపోయింది. ఈ పరిణామం ఆ పార్టీ వర్గాల్లో ముఖ్యంగా రాజా అనుయాయుల్లో ఆగ్రహాన్ని రేపింది. అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి మూకుమ్మడి రాజీనామాలతో తాడోపేడో తేల్చుకుందామన్న వారి ఆగ్రహజ్వాలలను ఆలపాటి రాజానే ప్రస్తుతానికి అణిచి వేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు పార్టీ నేతలకు టికెట్ నిరాకరించటం ఇదే మొదటిసారి కాదనీ, నమ్మినవారిని నిలువునా ముంచటం ఆయన నైజమనీ స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.

ముచ్చటగా మూడో సారి

1994లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ రావి రవీంద్రనాథ్‌ను టీడీపీలో చేర్చుకుని, పార్టీ టికెట్‌ను కట్టబెట్టారు చంద్రబాబు. ఆ ఎన్నికల్లో పోటీచేసిన డాక్టర్ రావి, సమీప కాంగ్రెస్ అభ్యర్థి, అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే నాదెండ్ల భాస్కరరావుపై పోటీచేశారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి కూడా రంగంలో ఉండటంతో ఆ ఎన్నికల్లో డాక్టర్ రావి 13,531 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1999 ఎన్నికలు వచ్చేసరికి సీను మారిపోయింది. సిట్టింగ్ అభ్యర్థి డాక్టర్ రావి రవీంద్రనాథ్‌కు టికెట్ నిరాకరించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నేత కొణిజేటి రోశయ్య పోటీ చేస్తున్నారన్న సాకుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక రాజకీయ ప్రముఖుడు ఆలపాటి వెంకట్రామయ్య మనుమరాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దొడ్డపనేని ఇందిర కుమార్తె, వైద్యవృత్తిలో ఉన్న డాక్టర్ గోగినేని ఉమను పార్టీలోకి తీసుకుని టికెట్ కట్టబెట్టారు చంద్రబాబు. మున్సిపల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగి, రెండుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చేసిన డాక్టర్ రావి రవీంద్రనాథ్‌ను నిర్దాక్షిణ్యంగా పక్కన బెట్టారు. 1999 ఎన్నికలలో కొత్తగా ఓట్ల రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ ఉమ 5,394 ఓట్ల ఆధిక్యతతో కొణిజేటి రోశయ్యపై విజయం సాధించారు. 2004లో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమకు ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనంలో ఓటమి అనివార్యమైంది. సీనియర్ రాజకీయ నేత నాదెండ్ల భాస్కరరావు తనయుడు నాదెండ్ల మనోహర్ ఆ ఎన్నికల్లో 12,606 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. 2009 ఎన్నికలొచ్చేసరికి డాక్టర్ గోగినేని ఉమకు పార్టీ టికెట్ ఇవ్వలేదు. వేమూరు నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వు కావటంతో అక్కడ పోటీచేస్తూ వచ్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెనాలి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు.

2009 ఎన్నికల్లో వేమూరు నుంచి నక్కా ఆనందబాబు, తెనాలి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు పశ్చిమ స్థానం నుంచి చుక్కపల్లి రమేష్‌లు పోటీచేసిన విషయం తెలిసిందే. ఈ మూడు సీట్లకు అభ్యర్థిత్వాలను కట్టబెట్టేందుకు చంద్రబాబుకు భారీగా ముడుపులు ముట్టచెప్పారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ విధంగా వేమూరు నుంచి వచ్చిన ఆలపాటి రాజాకు తెనాలి టికెట్‌ను ఇచ్చేందుకు డాక్టర్ గోగినేని ఉమను పక్కనబెట్టారు. అప్పట్లో ఉమను తప్పించి టికెట్ తెచ్చుకున్న ఆలపాటి రాజాకు మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి ఎదురుకావటం చిత్రంకాదు...చంద్రబాబు నైజానికి మరో నిదర్శనం అంటున్నారు జనం. 1994 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తున్న ఆలపాటి రాజా వరుసగా మూడుసార్లు వేమూరు నుంచి పోటీచేశారు. అక్కడ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఒక పర్యాయం మంత్రిగా కూడా చేశారు. 2009, 2014, 2019 ఎన్నికల్లో వరుసగా తెనాలి నుంచి పోటీచేస్తున్నారు. గత ఆరు ఎన్నికల్లో పోటీపడుతూ వచ్చిన ఆలపాటిని, 2024 ఎన్నికలకు జనసేన పార్టీతో పొత్తుల పేరుతో చంద్రబాబు దూరం పెట్టారు. అవసరమైతే ఎవరినైనా అక్కున చేర్చుకోవటం, వద్దనుకుంటే నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసేయటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అనేది మరోసారి నిరూపణ అయిందంటూ తెనాలిలో చర్చలు నడుస్తున్నాయి.

అర్చకోద్యమ పితామహుడు రామాచార్యులు

- ఆయన ప్రభావంతోనే అర్చకుల సమస్యలపై అధ్యయనం
- తెనాలి బండ్ రూపకల్పన అభినందనీయం
- తెనాలి బండ్‌పై రామాచార్యులు విగ్రహాన్ని ఆవిష్కరించిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



సభలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, పక్కన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: తెనాలి ప్రాంత ఉన్నతికి కారకులైన మహానుభావుల విగ్రహాలతో తెనాలి బండ్ రూపకల్పన చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందనీయులని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఎవరు ఎంతగా ఎదిగినా మూలాలను మరచిపోరాదనేది తన భావనగా చెబుతూ అందుకు అనుగుణంగానే తెనాలిలో ప్రముఖుల విగ్రహాలతో తెనాలి బండ్‌ను ఏర్పాటుచేస్తున్నారని చెప్పారు. తన పదవీకాలంలో ఏం చేసినా చేయకున్నా తెనాలి బండ్ ఏర్పాటుతో ఎమ్మెల్యే శివకుమార్‌కు జీవితకాలం తృప్తి లభిస్తుందన్నారు. తెనాలి బండ్‌పై ప్రప్రథమంగా రామాచార్య స్మారక సమితిచే ప్రతిష్ఠించిన జాతీయవాది, అర్చకోద్యమ పితామహుడు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు తమిరిశ రామాచార్యులు కాంస్య విగ్రహాన్ని మంగళవారం త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. పుష్పాంజలి ఘటించారు. సభకు టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పూర్వం హైదరాబాద్ టాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలను ఎన్టీఆర్ ఏర్పాటు చేసినపుడు తనతో సహా చాలామంది విమర్శించారని గుర్తుచేశారు. ప్రజాదరణ చూసినపుడు ప్రజలకు తిండే కాదు...మిగిలినవి అవసరమని భావించానని చెప్పుకున్నారు. కాలేజిలో విద్యార్థి పరిషత్‌లో ఉన్నప్పట్నుంచి రామాచార్యులుతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. రామాచార్య స్మారక సమితి అధ్యక్షుడు తమిరిశ అనంతాచార్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయబాబు, వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు యడ్లపాటి స్వరూపరాణి, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మాట్లాడారు. విగ్రహ రూపశిల్పి కాటూరి వెంకటేశ్వరరావును గవర్నర్ చేతులమీదుగా సత్కరించారు.

భావితరాల కోసమే..

ముఖ్యఅతిథి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాలతోపాటు రాజకీయంగా చైతన్యవంతమైన తెనాలి ప్రాంతానికి కీర్తిని తీసుకొచ్చిన మహానుభావులు ఎందరో ఉన్నారని చెప్పారు. స్థానికుడినైన తాను వారి చరిత్రను నేటితరానికి, భావితరాలకు అందుబాటులోకి తీసుకురావాలని తెనాలి బండ్ ఏర్పాటుకు పూనుకున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

జిల్లాలో సజావుగా టెట్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో మంగళవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సజావుగా జరిగింది. నాలుగు పరీక్ష కేంద్రాల పరిధిలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కేటాయించిన 1,797 మంది అభ్యర్థుల్లో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌కు 1,559 మంది హాజరయ్యారు. పాఠశాల విద్యాశాఖ సమన్వయ విభాగ డైరెక్టర్ పి. పార్వతి, డీఈవో పి.శైలజ ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ప్రారంభమైనట్లు డీఈవో శైలజ చెప్పారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు రూరల్: వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి గుంటూరు లాంఫాం సార్వత్రిక దూర విద్యకేంద్రం కృషి చేస్తుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, మహిళలు యువత ఆసక్తిగల వారికి దూరవిద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పుట్టగొడుగుల పెంపకం, సేంద్రియ వ్యవసాయం 8 వారాల కోర్సులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ.1500 ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ సదుపాయం కలిగి కంప్యూటర్, ఆండ్రాయిడ్ ఫోన్, లేదా ఐపాడ్ కలిగి ఉండాలని తెలి పారు. ఆసక్తిగల అభ్యర్థులు మార్చి 20వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www. angrau.ac.in ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు 8008788776, 8309626619, 8096085560 నంబర్లకు ఉద యం 9 గంటలనుంచి సాయంత్రం 7 గంటల లోపు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

తాడికొండ: అక్రమంగా తరలిస్తున్న 140 మద్యం సీసాలను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక అడ్డరోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులతో పాటు, 140 బాటిళ్ల మద్యం, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన మద్యం పడవల ద్వారా కృష్ణా నది పరీవాహక ప్రాంతమైన తుళ్లూరు నుంచి ఇవతలి ఒడ్డుకు తరలించి మద్యం తీసుకెళుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.

పరిశోధనాత్మక ఆలోచనలతో చదవాలి

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి
- హిందూ ఫార్మసీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ భవన నిర్మాణానికి భూమిపూజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలతో చదవాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సిల్వర్‌జూబ్లీ భవన నిర్మాణానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిత్య జీవితంలో తారసపడే విషయాలను పరిశోధనా దృష్టితో చూడాలని సూచించారు. ఇందుకు ఉదాహరణగా తనకు ఎదురైన కొన్ని సందర్భాలను వివరించారు. అరటి బెరడులో మంచినీటిని తాగే అలవాటు కొన్ని ప్రాంతాల్లో ఉందని, అరటి బెరడులో ఉండే ఎటువంటి రసాయనాలు ఆరోగ్యానికి సహకరిస్తున్నాయనే విషయాలపై విద్యార్థులు పరిశోధించవచ్చన్నారు. త్రిపురలో ప్రజలు గుమ్మడికాయ ఆకులతో బజ్జీలు, గుమ్మడికాయ కాడలతో కూరలు చేసుకుంటారని, దీని వెనుక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అదే విధంగా అడవిలో వన్యమృగాలు అనారోగ్యంతో ఉన్నప్పుడు కొన్ని చెట్ల మొదళ్లను తింటాయని, ఆ మొదళ్లలో ఉన్న ఔషధ గుణాలను గుర్తించి పరిశోధన చేయాలని చెప్పారు. ఇలా కనిపించే ప్రతి విషయంలోను ఫార్మసీ విద్యార్థులు దృష్టి, పరిశోధన దృక్పథంతో ఉండాలన్నారు. విద్యార్థులకు ఫార్మసీ రంగంలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.



సిల్వర్ జూబ్లీ భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకం వద్ద త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, పక్కన జూపూడి రంగరాజు

బల్క్ డ్రగ్స్ తయారీ రంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశానికే తలమానికంగా ఉందని, ఈ రంగంలో ఫార్మసీ విద్యార్థులకు ఎంతో భవిష్యత్ లభిస్తుందని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులను కళాశాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని యాజమాన్యానికి సూచించారు. 125 ఏళ్ల క్రితం సంస్కృతాన్ని నేర్పించేందుకు ప్రారంభించిన హిందూ పాఠశాల ప్రస్తుతం శాఖోపశాఖలుగా విస్తరించి, అనేక కళాశాలలుగా ఎదగడంతో పాటు పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.

కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ 25 ఏళ్ల కళాశాల ప్రగతికి గుర్తుగా నిర్మిస్తున్న రజతోత్సవ భవనాన్ని ఆధునిక పరిశోధనశాలగా, డిజిటల్ గ్రంథాలయానికి వేదికగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనంతరం గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, కళాశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, బీజేపీ నాయకుడు ఆర్.లక్ష్మీపతి, న్యాయవాది పగడాల సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమ, విలువ, వ్యవస్థతో వివక్షను రూపుమాపగలం

- ప్రొఫెసర్ సిడియోల్ ఫ్రాంక్.హెచ్.దీన
- ఏఎన్‌యూలో అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: సమాజంలో వివక్షను రూపుమాపేందుకు ప్రేమ, విలువ, వ్యవస్థ ఎంతో ముఖ్యమని ఆస్ట్రేలియా ఫిలిండర్స్ యూనివర్సిటీ అధ్యాపకురాలు ప్రొఫెసర్ సిడియోల్ ఫ్రాంక్.హెచ్.దీన అన్నారు. ఏఎన్‌యూ ఆస్ట్రేలియన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో 'మార్జినాలిటీ అండ్ మల్టీ కల్చరల్ లిటరరీ నేటివ్ ఆస్ట్రేలియా అండ్ ఇండియా' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో రెండో రోజైన మంగళవారం పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు ప్రసంగించారు. కొందరు నేరుగా ప్రసంగించగా, కొందరు ఆన్‌లైన్ ద్వారా విదేశాల నుంచి తమ పరిశోధనా పత్రాలు సమర్పించి, ప్రసంగించారు. డాక్టర్ క్రిస్టియన్ విలియమ్స్ మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో దక్షిణాసియా డయాస్పోరిక్ సాహిత్యం ఎంతో వెలుగునిస్తోందని, ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటోందన్నారు. న్యూయార్క్‌కు చెందిన ప్రొఫెసర్ నికోలస్ బిర్న్స్, ముంబాయి యూనివర్సిటీ అధ్యాపకులు ప్రొఫెసర్ రాజేష్ కర్నకల్, కేరళ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ సుజా కురుప్, ప్రొఫెసర్ వైఎస్ శరత్ మాట్లాడారు. ప్రొఫెసర్ వి.నిర్మల అనువాద రచన ఫైర్ ఫ్లైస్ పై విమర్శనాత్మక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వీసీ, సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ సదస్సులో పాల్గొన్న కీనోట్ స్పీకర్లను సన్మానించారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానమైనా.. పెట్టుబడిదారీ వ్యవస్థ, అగ్రవర్ణాల ప్రభావం తగ్గినప్పుడే సామాన్యులు కూడా సమానత్వంలోకి వస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ పాల్ శరద్ తన ప్లీనరీ ప్రసంగంలో కీలకమైన అంతర దృష్టిలను వివరించారు. తాను రాసిన ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ ఆస్ట్రేలియన్ లిటరేచర్ అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ షమీం బ్లాక్ డయాస్పోరిక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సిడియోల్ ఫ్రాంక్.హెచ్.దీన, వీసీ ఆచార్య పి.రాజశేఖర్

నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలను నేషనల్ హెల్త్ మిషన్ నుంచి ఇద్దరు వైద్యులు మంగళవారం సందర్శించారు. క్వాలిటీ కంట్రోల్, కాయకల్ప పరిశీలించారు. యూనిసెఫ్ క్వాలిటీ మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ విక్రమ్‌రెడ్డి, స్టేట్ క్వాలిటీ మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్ పల్ల వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలు, వైద్య విధానం గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు వివిధ వార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో వైద్యశాలలను తాము పరిశీలించామని, కానీ సత్తెనపల్లి ఏరియా వైద్యశాల మాత్రం ప్రత్యేకంగా ఉందన్నారు. చాలా మంచి సేవలు అందుతున్నాయని చెప్పారు. పై అంతస్తు నిర్మాణం పూర్తయిన తర్వాత మరలా ఒకసారి తనిఖీ కోసం వస్తామని, ఇక్కడ డెలివరీలు బాగా జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ నేషనల్ సర్టిఫికేషన్ అయినా లక్ష్య, ముస్కాన్ అవార్డును దక్కించుకున్నామని, కాయకల్ప టీం కూడా అవార్డు అందిస్తారని ఆశా భావం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాయకల్ప టీమ్‌ని అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు ఉన్నారు.



ఏరియా వైద్యశాలను పరిశీలిస్తున్న కాయకల్ప వైద్యుల బృందం

గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణకు అవార్డులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఐటీసీ బంగారు భవిష్యత్, సెర్ప్, ఫినిష్ సంస్థల సంయుక్తంగా గుంటూరు జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జెడ్పీ డెప్యూటీ సీఈఓ జె.మోహన్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలువురు ఎంపీడీఓలతో పాటు ఈఓపీఆర్డీలు, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, క్లాప్‌మిత్ర, షెడ్ మిత్రాలను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఐటీసీ పీవో సురేష్, సెర్ప్ సంస్థ కార్యదర్శి పార్థసారధి, జిల్లా సమన్వయకర్త నాగరాజు, శ్రీనివాసరావు, నారాయణ, ఫినిష్ ఎన్జీవో సంస్థ సిబ్బంది బుజ్జి, అరుణ, కోటేశ్వరరావు, ప్రదీప్, ఏసోబు పాల్గొన్నారు.



అధికారులను సత్కరిస్తున్న జెడ్పీ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు

ఖరీఫ్‌కు సరిపడా విత్తనాలు అందజేయాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కుర్రిసాయి మార్కొండారెడ్డి

నరసరావుపేట: రానున్న ఖరీఫ్ సీజన్‌కు కావల్సిన విత్తనాలు అంచనా వేసి రైతులకు ఆర్బీకేల ద్వారా సకాలంలో సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ రబీలో సాగుచేసిన వివిధరకాల పంటల విస్తీర్ణం ఈ-పంటలో నమోదు చేసినట్లు చెప్పారు. రైతుల ఈ-కేవైసీ కూడా పూర్తిచేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభించిన 48 ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా 455 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా శనగ పంట కొనుగోలు ప్రారంభిస్తున్నామన్నారు. డీఆర్వో కె.వినాయకం మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన విషయాలు ఆర్బీకేల ద్వారా రైతులకు చేరాలన్నారు. నానో యూరియా, డీఏపీలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ మార్కొండారెడ్డి

ఐబీ విధానంతో విద్యార్థి సమగ్రాభివృద్ధి

డైట్‌ను సందర్శించిన ఐబీ బృందం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయస్థాయి విద్య, విద్యార్థులు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటర్నేషనల్ బాకలారియట్(ఐబీ)తో చేసుకున్న ఒప్పందం కార్యాచరణకు దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఐబీ విద్యా విధానం అమలుకు అవసరమయ్యే సదుపాయాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ కేంద్రాన్ని ఐబీ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. డైట్ కళాశాలకు విచ్చేసిన ఐబీ బృంద సభ్యులు కరిక్యూలం స్పెషలిస్ట్ డాక్టర్ అలెన్(ఇంగ్లాండ్), పోస్ట్ ఆథరైజేషన్ పాలసీ అండ్ డిజైన్ సీనియర్ మేనేజర్ వెండీ గ్రీన్(అమెరికా), ఈక్విటీ అండ్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ సీనియర్ మేనేజర్ కళా పరుశురామ్‌లకు సాదరంగా ఆహ్వానించారు. తొలుత డైట్ కళాశాలలోని సైన్స్, మ్యాథ్స్ తదితర ల్యాబ్‌లను సందర్శించి విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను తిలకించారు. ఆయా ప్రయోగాల తయారీపై నెలకొన్న ఆసక్తి, ప్రేరణ, ప్రయోగ ఫలితాలు, వాటి ప్రయోజాల గురించి విద్యార్థులు వివరించారు. విద్యార్థుల పనితీరు, యాక్షన్, పరిశోధన ఫలితాలను పరిశీలించారు. వారి నిర్వహించే కార్యక్రమాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాల అంచనాలపై ఆరా తీశారు. ప్రస్తుతం డైట్ కళాశాలలో అందిస్తున్న విద్యాబోధన విధానం, ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నారు. అనంతరం దశల వారీగా ఐబీపై అవగాహన నైపుణ్యం, సామర్థ్యం పెంపుపై శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన సదుపాయాల కల్పనపై విషయాలను పరిశీలనకు వచ్చినట్లు బృందం తెలిపింది. బోధనలో సబ్జెక్టుల విభజన కాకుండా బహుళ బోధన విధానం అవలంబించడమే ఐబీ ప్రత్యేకత అని స్పష్టం చేసింది. ఆధునిక, సాంకేతికతను జోడించి ఏకకాలంలో విద్యార్థుల అభిరుచుల్ని అనుగుణంగా బోధన పద్ధతుల్లో మార్పు తెస్తున్నట్లు చెప్పారు. ఇందుకు గురువులు కూడా తమ వృత్తిపరమైన నైపుణ్యాల్ని పెంపొందించుకుని అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. ఐబీ, ఎస్‌సీఈఆర్‌టీ లు సమన్వయంతో అందించే ఈ నవీన విద్యాబోధన తీరును క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చేరేలా చేసినప్పుడే విద్యార్థి సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేయగలమన్నారు.



బోధన పద్ధతులపై ఆరా తీస్తున్న ఐబీ బృందం

చిన్న ఆలోచన నుంచే గొప్ప ఆవిష్కరణలు

పల్నాడు డీఈవో ఎం.వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య నుంచే విద్యార్థులు సృజనాత్మకతను అలవరుచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. స్థానిక మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లా స్థాయి ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లాలోని పది పాఠశాలల నుంచి విద్యార్థులు ఎక్స్‌పోలో తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎక్స్‌పోను ప్రారంభించిన డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైజ్ఞానిక రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ సామాజిక అవసరాలకు ఉపయోగపడే నూతన వస్తు సేవలపై ఇప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలని వివరించారు. గొప్ప ఆవిష్కరణలు సైతం చిన్న ఆలోచనల నుంచే ఆవిర్భవిస్తాయని తెలిపారు. ఎక్స్‌పోలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల (అమరావతి) విద్యార్థుల ఆయుర్వేద వైద్య చిట్కాలు ప్రథమ, జెడ్పీ హైస్కూల్ (తూబాడు) విద్యార్థుల కుట్టు, అల్లికలు ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతులు లభించాయి. ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎ.ఎ.మధుకుమార్ తెలిపారు. ఎంపిక జ్యూరీ కమిటీ సభ్యులుగా కె.చిట్టెమ్మ, ఒ.సాంబయ్య, మధుకుమార్ వ్యవహరించారు. విజేతలకు డీఈఓ వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీహెచ్ రఘురామ్, కె.నాగపావని, డి.లక్ష్మి, వెంకటకృష్ణ పాల్గొన్నారు.



ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

చిలకలూరిపేట టౌన్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన షేక్ అబుబకర్(11) పట్టణంలోని వడ్డెర కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఉదయం బాలుడి తల్లి మంచినీరు పట్టే పనికి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ వైర్లతో ఆడుకుంటున్న అబుబకర్ వైర్ల మధ్య ఉన్న జాయింట్ నీటిలో పడి ఉండటం గమనించలేదు. విద్యుత్ ప్రసరించటంతో బాలుడు షాక్‌కు గురై మృతి చెందాడు. గమనించి బాలుడి అక్క షేక్ హుస్నా మెయిన్ ఆఫ్‌చేసి రక్షించే ప్రయత్నం చేసింది. సమీపంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.